

యూట్యూబ్‌లో 'చంద్ర'హాసం

- సామాజిక సందేశాలే ఇతివృత్తాలుగా రీల్స్
- పది చానెళ్లను నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు
- లక్షలాది మంది ఫాలోవర్లు..

6





ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో దేదీప్యమానంగా ఆర్‌సీఎం చర్చి

క్రిస్మస్ కాంతులు..

- నగరంలో మొదలైన సందడి.. కాంతులీనుతున్న చర్చిలు
- జోరుగా షాపింగ్, పండుగ సంబంధిత వస్తువుల కొనుగోళ్లు
- జోరుగా సాగుతున్న సెమీ క్రిస్మస్ సంబురాలు

వివరాలు : 6లో



కొత్తగూడెంలో విద్యార్థులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిట్‌ను తిలకిస్తున్న సీఎండీ బలరాం



సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బెలూన్లను ఎగురవేస్తున్న దృశ్యం

బొగ్గు రంగంలో సవాళ్లను అధిగమిస్తాం..

- సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యం..
- నూతన ఓపెన్‌కాస్ట్‌ల్లో త్వరలో బొగ్గు ఉత్పత్తి
- పగిడేరులో 300మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ కేంద్రం
- సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం
- కొత్తగూడెంలో ఘనంగా సంస్థ ఆవిర్భావ దినోత్సవం

వివరాలు : 7లో

నేడు మంత్రి తుమ్మల రాక

మూడు రోజుల పాటు పర్యటన

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం నుంచి గురువారం వరకు జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం సాయంత్రం 5గంటలకు రఘునాథపాలెం మండలం దొనబండకు చేరుకుని సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. ఈర్లపుడి, కొర్లబోడు తండాలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. 25న ఉదయం 5.45కి చర్చికాంపౌండ్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. 26న సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఆర్అండ్‌బీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో బీటీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి కో ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తారు. తల్లాడ మండలం నూతన్‌కల్‌లో కోఆపరేటివ్ సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తారు. ఖమ్మంలో శ్రీరాంహిల్స్ ఒకటో డివిజన్‌లో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు.

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

మధిరటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం మధిరలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు హైదరాబాద్ నుంచి ఖమ్మం చేరుకొని అక్కడ ముదిగొండ, చింతకాని, బోనకల్ కాంగ్రెస్ మండల కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు మధిర లో మధిర, ఎర్రుపాలెం మండల కమిటీ సభ్యులతో సమావేశం అయన అనంతరం రాత్రి మండలంలోని బయ్యారం చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. రాత్రి మధిరలోని క్యాంపు కార్యాలయంలో బస చేస్తారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు మధిర నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లనున్నారు.

జిల్లాలో బోదకాల(ఫైలేరియా) బాధితులు పెరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు 1,416 మంది బాదితులను గుర్తించిన ఆ శాఖ ఇటీవలె సర్వే చేపట్టింది. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా కేసులు పెరుగుతున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలను వైద్యశాఖ అధికారులు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిసింది. ఈ నెల 6నుంచి ఫైలేరియాపై జిల్లా వైద్యారోగ్యశాఖ సర్వేచేపట్టింది. మొత్తం 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అనుమానితుల నుంచి రక్త నమూనాలనుసేకరించింది. మొత్తం 7200 మంది నుంచి రక్తనమూనాలను సేకరించి ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.



మళ్లీ ఫైలేరియా..

- జిల్లాలో పెరుగుతున్న బాధితుల సంఖ్య
- సర్వేలో జిల్లా వైద్యారోగ్యశాఖ గుర్తింపు
- కేసుల నమోదులో రాష్ట్రంలోనే ప్రథమస్థానం
- నాలుగు పీహెచ్‌సీల పరిధిలో ఎక్కువ బాధితులు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు 1,416 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఏడాది7,200 నమూనాల సేకరణకు 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 100 బృందాలను ఏర్పాటు చేశారు. 30 మంది వైద్యాధికారులు, ఒక్కో పీహెచ్‌సీ నుంచి ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్వైజర్లు, ఆశా వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియను నియమించారు.

తిరుమలాయపాలెం, కూసుమంచి, ముదిగొండ, కామేపల్లి, ఖమ్మం రూరల్ మండలాల్లోని హైరిస్క్ గ్రామాల్లో ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యులు, వైద్య సిబ్బంది రాత్రివేళల్లో రక్త నమూనాల సేకరణ పూర్తిచేస్తారు. సేకరించిన నమూనాలను ఖమ్మం మెడికల్ కళాశాలలో మైక్రోబయాలజీ ల్యాబ్‌లలో ల్యాబ్ టెక్నీషియన్లు పరీక్షలను నిర్వహిస్తున్నారు. రోజుకి 30 నుంచి 40 నమూనాలను ఏడుగురు టెక్నీషిన్లు నిర్వహిస్తున్నారు. అయితే వీటిల్లో కూసుమంచి, జక్కేపల్లి, దెందుకూరు, ముదిగొండ, కామేపల్లి వల్లభి గ్రామాలు, పీహెచ్‌సీల పరిధిలో కేసులు అధికంగా నమోదవుతున్నట్లు తెలుస్తోంది.

కూసుమంచి, దెందుకూరు పీహెచ్‌సీల్లో అధికంగా కేసులు నమోదవుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఇప్పటికే 30 కేసులు నిర్ధారణ అయినట్లు సమాచారం. తిరుమలాయపాలెం, సుబ్లేడు పీహెచ్‌సీల్లో ఇప్పటికే అధిక కేసులు నమోదై బాధితులు చికిత్స పొందుతున్నారు. తాజా సర్వేలో అధిక మొత్తంగా కేసులు నిర్ధారణ అవుతుండడంతో వైద్య శాఖ అధికారులు విస్మయానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. అయితే వీటిని నిర్ధారించేందుకు మళ్లీ సెంట్రల్ మెడికల్ ల్యాబ్ (సీఎంఎల్)కు ర్యాండంగా నమూనాలు పంపించనున్నట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను సంప్రదిస్తే నమూనాలు సేకరించామని, ల్యాబ్‌లలో వాటి పరీక్షలు కొనసాగుతున్నాయని చెప్పారు. పెరుగుతున్న కేసులపై మాత్రం నిర్ధారించలేదు.

బోధకాల వ్యాధి ఎలా వస్తుంది.

గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా నీరు నిల్వ ఉండే ప్రాంతాలాలో దోమలు విజృంభిస్తాయి. ఈ వ్యాధి ఫైలేరియా అనే సూక్ష్మక్రిమి ద్వారా వస్తుంది. ఇంటి పరిసరాలలో ఉన్న మురుగు నీటిలో గుడ్లు పెట్టి వృద్ధి చెందే క్యూలెక్స్ దోమ ద్వారా ఒకరి



ఖమ్మం మెడికల్ కళాశాలలో శాంపిల్స్‌ను పరీక్షిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. దోమకాటు వేసినప్పుడు చర్మం నుంచి శరీరంలోకి ప్రవేశించి లింఫోటిక్ మజిల్స్‌లోకి ప్రవేశించి శరీరం మొత్తం వ్యాపిస్తుంది. ఫైలేరియా వ్యాధి కాళ్లకే వస్తుంది అని అనుకుంటాం, కాని ఈవ్యాధి కాళ్ల భాగానికే కాక చేతులకు, పురుషాంగాలకు, హైడ్రోసిల్, రొమ్ము భాగానికి, స్త్రీ మర్మాంగాలకు కూడా వస్తుంది. దోమ కుట్టిన తర్వాత 40 రోజుల తర్వాత ఈ లక్షణాలు బహిర్గతం అవుతాయి. చలితో జ్వరం, తలనొప్పి, చర్మం మెద్దుబారడం, పుండ్లు పడటం లాంటి లక్షణాలు కనిపిస్తుంటాయి.

దేవాలయాలకు జియో ట్యాగింగ్

ఇంటర్వ్యూ



- ఆలయాల అభివృద్ధికి కార్యాచరణ
- భూముల కౌలు ద్వారా రూ.4కోట్ల ఆదాయం
- దశలవారీగా అన్ని ఆలయాలకు కమిటీలు
- దేవాదాయశాఖ అసిస్టెట్ కమిషనర్ ఎం.వీరస్వామి

ఖమ్మం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆలయాలన్నింటికి కొత్త శోభను తెచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకుని దేవాదాయశాఖ పనిచేస్తుందని దేవాదాయశాఖ ఉమ్మడి ఖమ్మంజిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎం.వీరస్వామి 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ఉమ్మడిజిల్లాలో ఆలయాల అబివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో ఎన్ని దేవాలయాలున్నాయి. వాటి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: ఉమ్మడిజిల్లాలో ఆదాయం వచ్చే ప్రధాన ఆలయాలు 86 ఉండగా 6ఏ కింద అతి ప్రధానమైన ఆలయాలు 11 ఉన్నాయి. 6బీ కింద 41, 6సీ కింద 34 ఉన్నాయి. ఇవి కాకుండా చిన్న ఆలయాలు కూడా జిల్లాలో ఉన్నాయి. ఆలయాల అభివృద్ధికి దేవాదాయశాఖ తరుపున అన్ని ఆలయాలను జియోట్యాగింగ్ చేయబోతున్నాం. దీనివల్ల రాష్ట్రంలో భక్తులు ఎవరైనా ఏ ఆలయాన్నైనా సందర్శించాలనుకుంటే నేరుగా సంబంధిత ఆలయాలకు వెళ్లే సౌలభ్యం ఉంటుంది.

ప్ర: జిల్లాలో దూప, దీప నైవేద్య పథకం అమల్లో ఉందా?

జ: జిల్లాలో 462 ఆలయాల్లో ఈపథకం అమలుచేస్తున్నాం. ప్రతినెలా అర్చకులకు రూ.10వేలు వారి అకౌంట్లకు (మిగతా 6వ పేజీలో)



మంత్రి తుమ్మలకు మున్నేరు పనులు, డిజైన్ గురించి వివరిస్తున్న నేషనల్ హైవే ఎస్ఈ యుగంధర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత

తీగల వంతెన మణిహారం కావాలి..

- ఏడాదిలోగా పనులు పూర్తికావాలి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

ఖమ్మం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన ఖమ్మం గుమ్మంకు మణిహారంగా నిలవాలని ఏడాదిలోగా యుద్ధ ప్రాతిపదికన పనులుపూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం మున్నేరుపై రూ.180క్లోతో నిర్మాణమవుతున్న తీగల వంతెన పనులపైనా డిజైన్‌పైనా హైదరాబాదులో సోమవారం ఆర్అండ్‌బీ అధికారులతో పాటు తీగల బ్రిడ్జి నిర్మాణ సంస్థ అశోక్ బిల్డ్‌కన్ సంస్థ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు.

హైదరాబాదు తర్వాత వేగంగా అభివృద్ధిచెందుతున్న నగరంగా ఖమ్మం నగరానికి గుర్తింపు పొంది ఉందని, మున్నేరుతీగల వంతెన అద్భుతంగా, ఆకర్షణీయంగా ఉండాలని సూచించారు. డిజైన్‌కు సంబధించి కూడా పలుమార్పులు చేశారు. అత్యాధునిక టెక్నాలజీతో అద్భుతపరిచేలా నిర్మించే ఈవంతెన వచ్చే ఏడాది డిసెంబరు చివరినాటికి పూర్తికావాలన్నారు. బ్రిడ్జి ప్రారంభం కార్యక్రమం అట్టహసాంగా నిర్మించేలా కార్యచరణ (మిగతా 6వ పేజీలో)

అందాల పూబెల్లికి పర్యాటక సొబగులు

ఇల్లెందు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సహజ ప్రకృతి అందాలకు నెలవుగా వున్న ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా గత నెలలో పూబెల్లిని సందర్శించిన కలెక్టర్.. అక్కడి ప్రకృతి సోయగాలకు ముగ్దుయ్యారు. గ్రామాన్ని పర్యాటకంగా తీర్చిద్దాలని అప్పుడే అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఆయన సోమవారం పూబెల్లిని రెండోసారి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. చెరువులు, జలపాతాలు, పచ్చని పంట పొలాలు, రోడ్డుకు ఇరువైపుల ఆహ్లాదం పంచే చెట్లు, ఆదివాసీ సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆహారపు అలవాట్లతో పూబెల్లి పర్యాటక ప్రాంతంగా ఎదగడానికి అన్ని అర్హతలు కలిగి ఉందని తెలిపారు. గ్రామస్థులు సహ కరిస్తే ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని బ్లాక్‌బెర్రీ దీవిలాగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పర్యాటకంగా అభివృద్ధి చెందడం వల్ల గ్రామంలోని మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా పూబెల్లిలో పర్యాటక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యాటకుల కోసం సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రకృతి సోయగాలకు నెలవు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందుకు 12.కి.మీ దూరంలో పూబెల్లి గ్రామం ఉంటుంది. ఇది పూర్తిగా గిరిజనుల ఆవాసం. ఇక్కడ 231 కుటుంబాలు.. 600 మందిపైగా నివసిస్తున్నారు. రెండు గిరిజన ఆదివాసీ గుంపులు కలిగిన ఈ గ్రామం ప్రకృతి అందాలకు, గిరిజన సంస్కృతీ సంప్రదాయలకు నెలవుగా ఉంది. చుట్టూరా అడవి, హరితశోభతో అలరారే పంట పొలాలు, భారీ వృక్షాలు, జలకళతో ఉట్టిపడే చెరువులు, గ్రామానికి సమీపంలో నిత్యం జలసవ్వడి వినిపించే పులిగుండాల జలపాతం.. ఇలా ఒకటేమిటి అద్భుతమైన ప్రాకృతిక అందాలతో ఈ గ్రామం కోనసీమను తలపిస్తూ ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంది. ఈ ప్రత్యేకతలే కలెక్టర్ జితేశ్‌ను ఆకట్టుకున్నాయి. వసతులు కల్పించడం ద్వారా, అదనపు ఆకర్షణలను సృష్టించడం ద్వారా పూబెల్లిని టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దవచ్చని సంకల్పించారు. అధికారులను సమన్వయం చేస్తూ చర్యలు చేపట్టారు. పర్యాటకులు స్టే చేసేలా డేరాలు, చెరువుల్లో బోట్లు, రుచికరమైన వంటకాలకు హోటళ్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. తాడ్వాయి మండలంలోని జలగలంచ వాగు ఒడ్డున ఏర్పాటుచేసిన బ్లాక్‌బెర్రీ దీవిని సందర్శించేందుకు పూబెల్లి వాసులను పంపించేందుకు నిర్ణయించారు. పూబెల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేయడం వల్ల అటు పర్యాటకులకు ఆనందంతో పాటు, ఇటు గ్రామస్థులకు ఎంతో ఉపాధి కలుగుతుందని కలెక్టర్ చెబుతున్నారు. ఇక్కడ మరో విశేషమిటంటే.. సెల్ సిగ్నల్స్‌కు అందనంత దూరంలో పూబెల్లి ఉంటుంది. ఇక్కడ ఏ సెల్‌ఫోన్ పనిచేయదు. నిత్యజీవితపు రణగొణ ధ్వనుల నుంచి ఒకటిరెండు రోజుల పాటు మానసిక ప్రశాంతత కోరుకునే వారికి పూబెల్లి పర్యాటకధామం కానుందా? కాలమే చెప్పాలి.



ఆదివాసులతో మాట్లాడుతున్న కలెక్టర్



ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామ సమీపంలో పచ్చని పంట పొలాలు, కొండలు

- బ్లాక్‌బెర్రీ దీవిలా తీర్చిదిద్దుతామన్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్
- పర్యాటక హంగులు కల్పించేందుకు చకచకా చర్యలు
- అద్భుతమైన ప్రకృతి అందాలకు నెలవుగా ఉన్న గిరిజన గూడెం
- సెల్‌ఫోన్ సిగ్నల్స్ సైతం చేరని అటవీగ్రామం
- డేరాలు, బోటింగ్, హోటల్ ఏర్పాటుకు ప్లాన్

దారుణం

- 12 ఏళ్ల కూతురుపై తండ్రి లైంగిక దాడి
- కొత్తగూడెంలో వెలుగు చూసిన ఘటన
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు
- నిందితుడు హోటల్‌లో కార్మికుడు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపై ఓ వ్యక్తి లైంగిక దాడి చేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై కొత్తగూడెంలో పోక్సో కేసు నమోదైంది. కొత్తగూడెం పట్టణంలో ఓ కుటుంబం హోటల్‌లో పని చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. దాంతో భార్య తన పన్నెండేళ్ల వయస్సున్న కూతురిని తీసుకొని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే ఇటీవల సదరు వ్యక్తి తన భార్య, కూతురును చూసేందుకు వారి వద్దకు వెళ్లాడు. అక్కడ తండ్రిని చూసి కూతురు భయపడుతూ వణికిపోయింది. ఇది గమనించిన తల్లి ఎందుకు భయపడుతున్నావని ఆరా తీయగా గతంలో అతడు తనపై లైంగికంగా దాడి చేశాడని తెలిపింది. దీంతో కుటుంబ సభ్యుల సహకారంతో తల్లి కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ విచారణ చేపట్టారు. నిందితుడిపై వన్‌టౌన్ సీఐ కరుణాకర్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- ప్రాచుర్యం పొందిన సీఎస్ఐ సేయింట్ ఆండ్రూస్ చర్చి
- ఆనాటి జ్ఞాపకాలతో రూ.2కోట్ల వ్యయంతో అత్యాధునికంగా రూపకల్పన
- 1943లో ఆంగ్లేయుల కోసం నిర్మించుకున్న చర్చి నేడు ప్రజాదరణలో మేటి
- 1919లో కొత్తగూడెంలో ఆంగ్లేయులు నిర్మించిన ఆర్సీఎం చర్చీ..


సీఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చి.

పరిశుద్ధ ప్రాంగణాలు.. క్రైస్తవ మందిరాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆంగ్లేయుల కాలం నుంచి నేటి వరకు ఆసియాలోనే అతిపెద్ద రెండో చర్చిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఉన్న సీఎస్ఐ చర్చి పేరుగాంచింది. 1943లో చర్చి ప్రస్థానం ప్రారంభం కాగా.. 1975లో విస్తరించింది. 1995 నుంచి 2000 సంవత్సరం వరకు జరిగిన నిధుల సమీకరణతో రెవరెండ్ బి. లాజరస్ లాల్‌సింగ్ సంఘ విస్తరణతోపాటు చర్చి నిర్మాణానికి పూనుకున్నారు. 2002 జనవరి 26తేదీన చర్చి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి పనులు ప్రారంభించారు. రూ.2కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న చర్చిలో అప్పటి మెదక్ బిషప్ సీఎస్ఐ రెవ. డాక్టర్ దివంగత బీపీ. సుగందర్ ప్రార్థనలు ప్రారంభించారు. ప్రస్తుత డోర్నకల్ బిషప్ రెవ డాక్టర్ కోడిరెక్కల పద్మారావు పర్యవేక్షణలో ప్రార్థనలు కొనసాగుతున్నాయి. నూతనంగా ఈ చర్చిని 1జనవరి 2005న ప్రారంభించారు.

చర్చి నిర్మాణ విశిష్టత

ఆలయం పొడవు పరిశుద్ధ స్థలం నుంచి పోర్టికో వరకు 229 అడుగులు, వెడల్పు 106 అడుగులు. ఆలయ నిర్మాణంలో రెండు రకాల పిల్లర్స్ వేశారు. ఒకటి పలుకలుగా ఉండే పిల్లర్, మరొకటి గుండ్రటి పిల్లర్. పలకల పిల్లర్ సైజ్ 18ఇంటు9 అడుగులు, గుండ్రటి పిల్లర్ సైజ్ 18. చర్చి ప్రార్థన మందిరం మొత్తం 94 పిల్లర్లతో ఏర్పాటైంది. ఆరడుగుల ఎత్తుతో ఇత్తడితో చేసిన శిలువను ప్రార్థన మందిరం గోపురంపై నిర్మించారు. ఆలయ పరిశుద్ధ స్థలంలో మొదటి నుంచి చివరి వరకు కలపను చక్కటి నైపుణ్యంతో ఏసుక్రీస్తు భోజన బల్లను ఏర్పాటు చేశారు. 28 తలుపులు, 96కిటికీలు, 104 వెంటిలేటర్లతో అతి సుందరంగా భవనాన్ని చూడ చక్కగా మలిచార.

ప్రార్థన మందిరంలో విశిష్టతలివి...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకే తలమానికంగా నిలిచి అతి సుందరంగా నిర్మించిన ఈ సీఎస్ఐ చర్చి ప్రాంగణమంతా దైవ ప్రవచనాలతో సంప్రదాయబద్ధంగా ఆధ్యాత్మిక కట్టడాలున్నాయి. ఐదువేల మంది ఒకేసారి ఈ మందిరంలో ప్రార్థన చేసుకునేంత విశాల స్థలం ఉంది. చర్చి బాల్కానిలో కూడా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి రోజు 24 గంటలు, 365రోజులు ఏకదాటిగా ఆధ్యాత్మిక ప్రవచనాలతోపాటు మత ప్రార్థనలు నిర్వహించడం విశేషం. అయితే ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన షాపింగ్ కాంప్లెక్స్‌లు కూడా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. చర్చి ప్రాంగణంజూబ్లీ హాల్‌ను క్రైస్తవుల శుభ కార్యాలకు వినియోగిస్తున్నారు.


కొత్తగూడెంలోని ఎ పవర్‌హౌస్‌లో బెతస్థ ప్రార్థన మందిరం

జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఎ పవర్‌హౌస్‌బస్తీలోని బెతస్థ ప్రార్థన మందిరం, న్యూగొల్లగూడెంలోని సియోనా ప్రార్థన మందిరం, ప్యూన్‌బస్తీలోని న్యూలైఫ్ చర్చీ, రామవరంలోని బెతనియ, రాంనగర్‌లోని బెరాక, మన్న చర్చిల్లో క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రార్థనలను నిర్వహిస్తున్నారు. ఈ క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ఆరాధనలు నిర్వహించేందుకు చర్చి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.

1919లో నిర్మించిన ఆర్సీఎం చర్చి

ఇల్లెందు ప్రాంతంలో సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల కోసం 1919 సంవత్సరంలో రోమెన్ క్యాథలిక్ మిషనరీ (ఆర్సీఎం) పర్యవేక్షణలో కొత్తగూడెం ప్రాంతంలోని రైటర్‌బస్తీలో చిన్న మందిరాన్ని ఏర్పాటు చేశారు. కాలక్రమేణ ఈ మందిరం కొత్తగూడెం ఆర్సీఎం చర్చిగా ఆవిర్భవించింది. ఈ చర్చిలో జూలూరుపాడు, చంద్రుగొండ, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు తదితర ప్రాంతాల నుంచి క్రైస్తవులు సుమారు 60 ఏళ్లపాటు ప్రార్థన నిర్వహించారు.



సామాజిక సందేశాన్నిచ్చే ఇతివృత్తాలతో రీల్స్, షార్ట్స్ చేస్తూ యూట్యూబ్ ఫేమస్ అయ్యాడు కంద్రాతి చంద్రశేఖర్ (చందూ). నటన, రచన, దరకత్వం వంటి సృజనాత్మక అంశాల్లో తాను అవకాశాలు దక్కించుకోవటంతో సంతృప్తిపడలేదు. తనలాంటి ఎందరో అవకాశాల కోసం ఎదురుచూస్తున్న వారిని ప్రోత్సహిస్తుండటం ఇతడిలోని మరో ప్రత్యేకత. సినిమాలు, టీవీ షోల లో అవకాశాల కోసం అనేక ఏళ్ల పాటు చేసిన ప్రయత్నాలు, ఎదురైన అనుభవాల నేపథ్యంలో తానే సొంతంగా యూట్యూబ్ చానెల్‌ను ప్రారంభించాడు. ఒక చానెల్ ద్వారా వచ్చిన గుర్తింపుతో ఏకంగా పదికి పైగా సొంత చానెళ్లను నడిపిస్తున్నాడు. అంతేకాకుండా ఇతరులకు చెందిన యూట్యూబ్ చానెళ్లకు క్రియేటివ్ హెడ్‌గా తోడ్పాటునందిస్తున్నాడు.


యూ ట్యూబ్ అవార్డులు చూపుతున్న చంద్రశేఖర్

ఖమ్మం యూట్యూబర్ నెట్టింట స్టార్

- యూట్యూబ్‌లో రాణిస్తున్న చంద్రశేఖర్
- సామాజిక సందేశాలే ఇతివృత్తాలుగా రీల్స్
- పది చానెళ్లను నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు
- లక్షలాది మంది ఫాలోవర్లు..
- యూట్యూబ్ నుంచి వార్షిక ప్రత్యేక అవార్డులు


మయూరి అవార్డు చూపుతున్న చంద్రశేఖర్

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురం చెరువుకట్ట ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ ప్రజలను అప్రమత్తం చేసేలా సలహాలు, సూచనలు ఇచ్చేలా నీతి బోధించేలా చిన్నచిన్న రీల్స్ చేసి యూట్యూబ్ తోపాటు, ఇన్‌స్టా, ఫేస్ బుక్ రీల్స్‌గా పెడుతుంటాడు. ఇతడి యూట్యూబ్ చానెళ్లలో ఒక్కో దానికి 3 లక్షల నుంచి 5 లక్షల మంది వరకు ఫాలోవర్లు ఉన్నారు. ఇతను నిర్వహిస్తున్న అన్ని చానెళ్లకు కలిపి దాదాపు ఇరవై లక్షల మంది ఫాలోవర్లున్నారు. చంద్రశేఖర్ రూపొందించే వీడియోలకు ఆదరణ 80 లక్షల వరకు ఉండటం గమనార్హం. వైడీ ట్రెండింగ్, వైడీ నాన్ వెజ్, వైడీ వెజ్ తదితర చానెళ్లను, ఇన్‌స్టాలో ఓ ఇంటి కథలు పేరుతో రీల్స్‌ను పోస్టు చేస్తున్నాడు.

యూట్యూబ్‌లో కార్యక్రమాల ద్వారా ఫేమస్ అయినందుకు ఇతనికి హైదరాబాద్‌కు చెందిన మయూరి ఆర్ట్స్ అనే సాంస్కృతిక సంస్థ అవార్డును బహూకరించింది. ఇతడి యూట్యూబ్ కృషికి గానూ యూట్యూబ్ సంస్థ ఏడాదికొకటి చొప్పున అవార్డులతో సత్కరించింది. యూట్యూబ్‌లో కార్యక్రమాల అప్ లోడ్, వ్యూయర్స్ ఆధారంగా ఈ అవార్డులు దక్కాయి. సినీ కొరియోగ్రాఫర్ లారెన్స్ స్టైల్ చిత్రంలో పాట రాసే అవకాశం కల్పించాడు. అలా నాకోసం నీవు, నీకోసం నేనుఅనే పాటను రాశాడు. చంద్రశేఖర్‌ను భార్య సునీత ప్రోత్సాహించటంతో మరోసారి హైదరాబాద్ వెళ్లి టీవీ చానెళ్లకు స్క్రిప్టులు, నటన కోసం ప్రయత్నించాడు. పలు చానెళ్లలో జూలకటక, దేశముదురు, పటాస్ అనే కార్యక్రమాలకు స్క్రిప్ట్‌తో నటించే అవకాశం దక్కించుకున్నాడు. జబర్దస్త్ కు స్క్రిప్ట్‌తోపాటు, చాలా ఎపిసోడ్లలో నటించాడు. తన కుమార్తె యోధ జబర్దస్త్, తదితర కార్యక్రమాల్లో నటిస్తుండటంతో ఆమె కెరియర్‌ను తీర్చిదిద్దేందుకు సమయం కేటాయించాడు.

అడవి అలుగు స్వాధీనం

అక్రమంగా తరలిస్తుండగా దుమ్ముగూడెం వద్ద అటవీ అధికారుల పట్టివేత

దుమ్ముగూడెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అడవిలో సంచరించే అరుదైన జీవి అలుగు.. ఈ అడవి జీవిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా భద్రాద్రి జిల్లా అటవీశాఖ అధికారులు ఆదివారం రాత్రి దుమ్ముగూడెం క్రాస్‌రోడ్డు సమీపంలో పట్టుకున్నారు. స్మగ్లింగ్‌కు పాల్పడిన పెదనల్లబల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ అటవీశాఖ అధికారులకు పట్టుబడగా, సారపాకకు చెందిన వెంకట్రావు, ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన గోపాల్‌లు ఈ దందాలో సూత్రదారులని తెలుస్తోంది. ఈ అలుగును ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కిష్టారంపాడు అటవీ ప్రాంతం నుంచి మండలంలోని గౌరారానికి సుమారు మూడు రోజుల క్రితం చేర్చారు. ఆదివారం రాత్రి దీన్ని గౌరారం నుంచి ఆటోలో తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారంతో అటవీశాఖ అధికారులు కాపుకాసి పట్టుకున్నారు.

అటవీశాఖ అధికారులు ఈ అలుగును స్వాధీనం చేసుకొని భద్రాచలం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. నిందితుడు బాలకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు సూత్రధారుల పాత్రపై విచారణ చేస్తున్నారు. ఈ విషయమై రేంజి అధికారి కమలను వివరణ కోరగా అలుగు పట్టుబడిన విషయం వాస్తవమేనని, పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.


అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న అరుదైన అలుగు

జాతీయస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు..

జిల్లా క్రీడాకారులు



ఖమ్మం స్పోర్ట్స్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎల్. విక్రమ్, ఎస్‌కె. సమ్రీన్ ఎంపికయ్యారు. వారు ఇటీవల నాగర్‌కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలలో 10 కిలోమీటర్ల పరుగు పోటీ విభాగంలో ప్రతిభ చూపి మూడు, నాల్గవ స్థానాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ షఫీ, కోచ్ గౌస్ తదితరులు అభినందించారు. జాతీయ పోటీలలో రాణించాలని వారు ఆకాంక్షించారు.

తీగల వంతెన మణిహారం కావాలి..

(5వ పేజీ తరువాయి)

ఉండాలని, ఇందకు యుద్ధప్రాతిపదికన చేయాలన్నారు. సూర్యాపేట, అశ్వారావుపేట రహదారిపై నిర్మిస్తున్న మున్నేరు బ్రిడ్జి 24నెలల కాలంకాగా ఇప్పటికే ఏడాదికాలం ముగిసిందని, వచ్చే ఏడాది నాణ్యతతో పనులు చేయాలని కోరారు. మొత్తం 16 ఫౌండేషన్లలో ఇప్పటికే 12ఫౌండేషన్లు, బెడ్‌బాక్సులు పూర్తయ్యాయని, స్లాబ్ సెగ్మెంట్ నిర్మాణం పూర్తిచేశామని ఆర్‌అండ్‌బీ అధికారులు వివరించారు. వర్షాకాలంలో కూడా ట్రాఫిక్ నియంత్రణకు పాతబ్రిడ్జిని వాడకునేలా ఏర్పాటుచేసుకోవాలని అధికారులకు మంత్రి తుమ్మల తెలిపారు. బైపాస్‌లోని ఆర్‌అండ్‌బీ బ్రిడ్జితోపాటు ప్రకాష్‌నగర్ వంతెన మరమ్మత్తులు శరవేగంగా చేపట్టాలని, నగరంలో అన్ని డివైడర్లకు మరమ్మతులు చేయాలని ఇందుకు పోలీసుశాఖ సహకారం తీసుకోవాలన్నారు. ఖమ్మంలో అన్ని రహదారులు, వంతెనలను ఆధునికీకరించాలని, ప్రయాణికులకు ప్రశాంత ప్రయాణం కలిపించేందుకు ఆర్‌అండ్‌బీ చొరవ తీసుకోవాలన్నారు.

జామాయిల్ చెట్లు నరికివేత

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జామాయిల్ తోటలో గుర్తుతెలియని వ్యక్తులు చెట్లు నరికి చోరీ చేసిన ఘటన మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. మండలంలోని పాకలగూడెం గ్రామానికి చెందిన బి.వెంకటేశ్ అనే రైతుకు చెందిన తోటలో దాదాపు వందచెట్లను నరికి చోరీకి పాల్పడ్డారు. రైతు ఉదయం పొలానికి వెళ్లగా దొంగలు చెట్లు నరికిన విషయం వెలుగులోకి వచ్చింది.

రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలి

- సీపీఎం తెలంగాణ రైతుసంఘం డిమాండ్
- నగరంలో ప్రదర్శన, కలెక్టరేట్ ఎదుట ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

ఖమ్మంటౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని ఎలాంటి మినహాయింపులు లేకుండా, బ్యాంక్‌లో అప్పు ఉన్న రైతులందరికీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణా రైతుసంఘం .(సీపీఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్నా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో 1.25లక్షలకు పైగా రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. రుణమాఫీ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.41వేల కోట్లు అంచనా వేసి, తరువాత రూ.31వేల కోట్లను ప్రకటించిందన్నారు. ఆచరణలో మాత్రం రూ.21వేల కోట్లను మాత్రమే విడుదల చేసిందని, కాగా నాలుగు విడతలుగా విడుదల చేసిన రుణమాఫీ సొమ్ములు అనేకమంది రైతుల ఖాతాలో జమకాలేదన్నారు.

కేంద్రప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రం అమల్లోకి వస్తే వ్యవసాయ ఉత్పత్తులు మొత్తం కార్పొరేట్ సంస్థల స్వాధీనంలోకి వెళ్లి, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుందన్నారు. ఈ విధానపత్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళ, బుధ, గురువారాల్లో జిల్లాలోని అన్ని గ్రామాల్లో విధానపత్రం ప్రతులను దహనం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాతా భాస్కరరావు, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కే. మీరా, సహాయ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

దేవాలయాలకు జియో ట్యాగింగ్

(5వ పేజీ తరువాయి)

జమచేయడం జరుగుతుంది. ఆలయాల్లో వారి గౌరవ వేతనంతోపాటు ఆలయాల్లో దూప, దీప నైవేద్యం ఏర్పాటుకు సౌలభ్యం కలిపిస్తున్నాం. కొత్తగా ఆలయాలు నిర్మించుకుంటే దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం. అలాగే 83మంది అర్చకులకు కూడా వేతనాలు అందిస్తున్నాం.

ప్ర: జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఏమైనా నిదులు మంజూరయ్యాయా. ఇందుకు సంబంధించి ప్రత్యేక పథకాలున్నాయా?

జ: జిల్లాలో స్నానాల లక్ష్మీపురం రామలింగేశ్వరస్వామి ఆలయానికి రూ.10లక్షలు మంజూరయ్యాయి. పనులు జరుగుతున్నాయి. దేవాదాయశాఖ పరిధిలో టీటీడీ భజన మందిరం స్కీం కింద వైరా మండలం అష్ణగుర్తిలో రామమందిరం నిర్మించడం జరుగుతుంది. ఈపథకం కింద బలహీనవర్గాలు, ఎస్సీ ఎస్టీ వర్గాల కాలనీల్లో ఆలయాలు నిర్మించుకోవాలనుకునే వారు రెండున్నర లక్షలు రూపాయలు జమచేస్తే రూ.10లక్షలు ప్రభుత్వం నుంచి ఇవ్వడం జరుగుతుంది.

ప్ర: జిల్లాలో దేవాలయాలకు పాలక మండళ్ల ఏర్పాటు ప్రక్రియ ఎంత వరకు వచ్చింది?


జ: జిల్లాలో ప్రధాన దేవాలయాలతోపాటు ఇతర దేవాలయాల కమిటీలకు పాలకమండళ్లను నియమిస్తాం. ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు తీసుకున్నాం. పెద్ద ఆలయాలకు 15మంది సభ్యులు, మధ్యతరహా ఆలయాలకు ఏడుగురు, చిన్న ఆలయాలకు ఐదుగురు చొప్పున పాలకమండలిని నిమయిస్తాం. ఇప్పటికి కొన్ని అలయాలకు కమిటీలు వేశాం.

ప్ర: జిల్లాలో దేవాదాయశాఖకు ఉన్న భూములు, వాటి పరిస్థితి?

జ: జిల్లాలో అన్ని ఆలయాలకు కలిపి 14,771 ఎకరాల భూములున్నాయి. ఇందులో 1,009 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. ప్రస్తుతం 9వేల ఎకరాల భూములకు కౌలు ద్వారా సుమారు రూ.4కోట్ల ఆదాయం వస్తోంది. దేవాదాయశాఖకు సంబంధించి 201 షాపులున్నాయి. వీటి ద్వారా ఏటా రూ.2కోట్ల36లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. ఇవి బహిరంగ వేలం నిర్వహించి ఆదాయాన్ని పెంచుతున్నాం.

ప్ర: దేవాలయ భూముల ఆక్రమణలకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు?

జ: జిల్లాలో దేవాలయ శాఖ భూములు వివరాలన్నీ ధరణి రికార్డుల్లో పకడ్బందీగా ఎక్కించాం. ఇప్పటికే కొన్ని భూములను సంబంధిత ఆలయ దేవుడి పేరుతో తీసుకున్నాం. కొన్నిచోట్ల సుమారు 1009 ఎకరాలు ఆక్రమణకు గురికాగా వీటిని దేవాదాయశాఖ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశాం.



ముస్తాబైన ఖమ్మం సీఎస్ఐ చర్చి


విక్రయానికి సిద్ధంగా ఉన్న క్రిస్మస్ సామగ్రి

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల ఆందోళన.. గండుగులపల్లి జడ్పీహెచ్ఎస్ వద్ద ఘటన


ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు

దమ్మపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడు విద్యార్థిని కొట్టిన ఘటనపై సదరు విద్యార్థి తల్లితండ్రులు గ్రామస్థులతో కలిసి ఆందోళనకు దిగిన ఘటన సోమవారం భద్రాద్రి జిల్లా గండుగులపల్లి జిల్లాపరిషత్ పాఠశాల వద్ద జరిగింది. దమ్మపేట మండలంలోని మొండివర్రె కాలనీ గ్రామానికి చెందిన యదిరాజ రోహిత్ గండుగులపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 21న శనివారం హోమ్‌వర్క్ చేయలేదని గణిత ఉపాధ్యాయుడు మారయ్య విద్యార్థి రోహిత్‌ను చెవిపై కొట్టడంతో చెవి నుంచి రక్తస్రావమైంది. శనివారం సాయంత్రం స్కూల్‌నుంచి ఇంటికి వెళ్లిన రోహిత్ ఈ విషయాన్ని తండ్రి వెంకటేశ్వరరావుకు చెప్పటంతో వెంటనే సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందించారు. ఆదివారం సెలవు కావటంతో సోమవారం మొండివర్రే కాలనీకి చెందిన గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గండుగులపల్లి పాఠశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. అయితే సోమవారం సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోవటంతో అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక దశలో గ్రామస్థులు పాఠశాలకు తాళం వేసేందుకు ప్రయత్నించగా హెచ్ఎం మస్తాన్‌వలీ వారిని వారించారు. దీంతో విద్యార్థి తల్లితండ్రులు ఉపాధ్యాయుడు మారయ్యపై చర్య తీసుకోవాలని లిఖితపూర్వకంగా జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. గణితం ఉపాధ్యాయుడు మారయ్య చిన్న తప్పులకు కూడా తరచూ విద్యార్థులను కఠినంగా దండిస్తున్నాడని పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన చేసిన గ్రామస్థులకు హెచ్ఎం మస్తాన్‌వలీ సర్ది చెప్పి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై దమ్మపేట ఎంఈవో, కొత్తగూడెం డీఈవోకు సమాచారం ఇచ్చినట్లు హెచ్ఎం తెలిపారు. ఉపాధ్యాయుడు మారయ్య మానసిక పరిస్థితి బాగోలేదని, ఇటీవలే గుండెకు సంబంధించిన చికిత్స చేసుకున్నట్లు తెలిసింది. మారయ్య ఇటీవలే ఖమ్మం నుంచి బదిలీపై గండుగులపల్లి పాఠశాలకు వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

క్రిస్మస్ కాంతులు..

- జోరుగా సాగుతున్న సెమీ క్రిస్మస్ సంబురాలు

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సందడి మొదలయ్యింది. క్రిస్మస్ క్రైస్తవులకు అతి పెద్ద పండుగ కావటంతో ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో క్రీస్తు విశ్వాసులతోపాటు మిషనరీలు బలంగా పనిచేస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, తల్లాడ, మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు తదితర ప్రాంతాల్లో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకొంటారు. పండుగ నిర్వహణకు అవసరమైన కొనుగోళ్ల కోసం క్రీస్తు విశ్వాసులు దుకాణాలను సందర్శిస్తుండటంతో ఖమ్మం తదితర పట్టణాల్లో వీధులు దుకాణాలు రద్దీగామారుతున్నాయి..

క్రిస్మస్ పండుగ సమీపిస్తుండగానే ఏసు ప్రభువు లోకానికి వచ్చాడన్న సందేశం చాటుతూ క్రైస్తవులు ఇళ్లమీద క్రిస్మస్ తారను వేలాడ దీయటం ఆనవాయితీ.. నక్షత్రాన్ని పోలిన ఆకృతిలో లైటింగ్ ఏర్పాటు చేసి ఇంటి పై అలంకరిస్తారు. వాటి కొనుగోళ్లతోపాటు పండుగలో ప్రధాన భూమిక పోషించే క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాస్ వేషధారణల పట్ల చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. ఎర్రని దుస్తులు, తెల్లని గడ్డం, పొడవు టోపీ ఆసక్తికరంగా ఉండే క్రిస్మస్ తాత వేషం ధరించటం క్రిస్మస్‌సంబురాల్లో ఒకటి కావటంతో నగరంలో వీటి విక్రయాలు జరుగుతున్నాయి. వీటితోపాటు పండుగ నాడు అవసరమయ్యే కేకులను, స్వీట్లను ఆర్డర్లు చేస్తుండటంతో స్వీట్ దుకాణాలు కళకళలాడుతున్నాయి. పండుగనాడు ధరించే కొత్త దుస్తులు, పిండి వంటల కోసం సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. కాగా మరో వంక విద్యాలయాలు, తదితర చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. క్రైస్తవ మిషనరీలు, వసతి గృహాలు, చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- ఓటర్ జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి
- ఎలక్టోరల్ అబ్జర్వర్ బాలమాయాదేవి



అధికారులతో సమీక్షిస్తున్న బాలమాయాదేవి

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి.బాలమాయాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓటర్ సవరణ జాబితా 2025పై ఆమె అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఓటరు జాబితాలో కొత్తగా నమోదవుతున్న వారి వివరాలను ర్యాండంగా చెక్ చేయాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి వచ్చిన ప్రతి అభ్యంతరం, క్లెయిమ్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఓటరుజాబితా నుంచి ఓటు తొలగించాలంటే స్పష్టమైన సమాచారం, కారణాలు ఉండాలని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గన్నీ సంచుల మాటున నొక్కేశారు

గుండాల పీఏసీఎస్‌లో రూ.14లక్షల స్వాహా

గుండాల, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): రైతులకు చెందాల్సిన గన్నీసంచుల డబ్బులను సొంతానికి వాడుకున్నారు.ఈ ఘటన గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో జరిగింది. 2020-21లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. గన్నీ సంచులు అందుబాటులో లేకపోవడంతో రైతులపైనే బ్యాగుల భారాన్ని మోపారు. పంట కొనుగోలు సమయంలో సంచికి రూ.23చొప్పున రైతుల కొనుగోలు చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే రైతుల ఖాతాలో జమచేస్తామని చెప్పారు. 2021 ఆగస్టులో గన్నీ సంచులకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రూ.14లక్షలు పీఏసీఎస్ సీఈవో పర్సనల్ ఎకౌంట్‌లో జమచేశారు. ఇదే అదనుగా అధికారులు అక్రమాలకు తెర లేపారు. ఓఅధికారి డబ్బులను సొంతానికి అవసరాలకు వాడుకొని, రైతులకు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నాడు. డబ్బులు ఇంకా పడలేదని, పడితే మీ ఖాతాలో జమచేస్తామని సమాధానాలు చెబుతున్నాడని రైతులు చెబుతున్నారు. రెండేళ్లుగా డబ్బుల కోసం తిరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం వెనుక ఆంతర్యం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాల్సిన ధాన్యాన్ని దళారుల నుంచి కొనుగోలు కొనుగోలు చేసి కమీషన్లు దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడ్డం సమ్మయ్య అనే రైతు మాట్లాడుతూ 210 బస్తాలకు గాను తనకు రూ.4800 రావాల్సి ఉందని, రెండేళ్లుగా తిరుగుతున్నా.. డబ్బులు రాలేదని తెలిపాడు.ఈ విషయమై డీసీవో ఖుర్షీద్‌ను వివరణ కోరగా...గన్నీ సంచుల డబ్బులు స్వాహా తన దృష్టికి రాలేదని తెలిపారు. రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతామన్నారు.

ముగ్గురు రైతులకు 'భూమిరత్న' అవార్డు

మధిర,డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు రైతులకు భూమిరత్న అవార్డు లభించింది. జాతీయ రైతుదినోత్సవం సందర్భంగా సోమవారం అనంతపురంలో రైతుసహాయ వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నాగేశ్వరరావుకు వీరికి ప్రశంశాపత్రంఅందజేశారు. మధిర పట్టణానికి చెందిన ప్రకృతి సేద్యం చేస్తున్న రైతు చీకటి నాగేశ్వరరావు, ముదిగొండ మండలం పెద్దమండవ గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు చల్లా నాగేశ్వరరావు, వేంసూరు మండలం కందుకూరుకు చెందిన దేశీయ వరివిత్తన అభివృద్ధి రైతు గొర్ల సత్యనారాయణరెడ్డికు అవార్డులు ప్రకటించి అందజేశారు.



అవార్డులు అందుకుంటున్న రైతులు

బొగ్గు రంగంలో సవాళ్లను అధిగమిస్తాం..

- సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యం..
- నూతన ఓపెన్‌కాస్ట్‌ల్లో త్వరలో బొగ్గు ఉత్పత్తి
- సింగరేణి సీఎండీ బలరాం
- ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవం



సింగరేణి జెండాను ఆవిష్కరిస్తున్న సీఎండీ బలరాం, స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్, డైరెక్టర్లు, నృత్య ప్రదర్శన

కొత్తగూడెం,డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): బొగ్గు రంగంలో వస్తున్న సవాళ్లను అధిగమించి సింగరేణి సంస్థను ప్రగతిపథంలో నడిపిస్తామని సింగరేణి చైర్మన్‌అండ్‌మేనేజింగ్ డైరెక్టర్ బలరాం పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నట్లు ప్రకటించారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా సోమవారం కొత్తగూడెంలోని ప్రకాశం గ్రౌండ్‌లో సింగరేణి జెండాను ఆవిష్కరించారు. స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు. కొత్తగూడెం ఏరియాలోని వీకే7 ఓపెన్‌కాస్ట్, ఇల్లెందు ఏరియాలోని రొంపేడు ఓపెన్‌కాస్ట్, రామగుండంలోని కోల్‌మైన్, గోలేటి ఓపెన్ కాస్ట్‌లకు అనుమతులు సాధించి త్వరలోనే బొగ్గు ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.8రాష్ట్రాల్లో సుమారు 2వేల పరిశ్రమలకుసింగరేణి బొగ్గును సరఫరా చేస్తున్నామని, రాజస్థాన్ రాష్ట్రంలో సైతం సోలార్ ప్లాట్లను ఏర్పాటుచేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. మణుగూరు ప్రాంతంలోని పగిడేరులో 300మెగావాట్ల జీయో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుకు చర్యలు కార్యాచరణ రూపొందించామన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న 42వేల కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ రంగ బ్యాంకులతో చర్చలు జరిపి కోటి రూపాయల బీమా పథకాన్ని సాధించామన్నారు. ఈఏడాది లాభాల నుంచి 33 శాతం లాభాల వాటాను అందజేశామని, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5వేల బోనస్ అందించామని గుర్తు చేశారు. సింగరేణిలో యంత్రాల వినియోగాన్ని 20గంటలకు పెంచాలన్నారు. ఉద్యోగులు 8గంటల పనివిధానాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తే సంస్థ ఉత్పత్తి, ఉత్పాదన పెరిగి సంస్థ మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, జనరల్ మేనేజర్ (సీడీఎన్) సుభానీ, జనరల్ మేనేజర్ పర్సనల్ కవితానాయుడు, జనరల్ మేనేజర్ వేల్ఫేర్ శ్రీనివాసరావు, గుర్తింపు కార్మికసంఘం కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం కార్యదర్శి జనక్ ప్రసాద్, జనరల్ మేనేజర్లు చింతల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, షాలెం రాజు, డీజీఎంలు, ఏజీఎంలు కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశిష్ఠ అతిథులుగా కలెక్టర్ జితేష్ విపాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ హాజరయ్యారు. జబర్దస్త్ టీం వేసిన స్కిట్లు పలువురిని నవ్వించాయి. ప్రముఖ గాయకులు ధనుంజయ్, ప్రణతి, శృతిక సముద్రాల, నృత్య కళకారిణి సీతాప్రసాద్, ఈటీవీడీ విజేత బాబి టీం నృత్య ప్రదర్శన, మెజీషియన్ అలీ మ్యాజిక్‌షో, మిమిక్రి జనార్ధన్ మాయాజాలం,విశాఖపట్నానికి చెందిన కళాకారుడు విజయ్ కాంతారా రోబో స్పెషల్ నాటికలను ప్రదర్శించారు. చైన్నై కళాకారుడు జగ్లర్స్ అశోక్-ఆనంద్ స్పెషల్ యాక్ట్ అబ్బురపర్చింది.

బీసీ హాస్టల్స్‌ను తనిఖీ చేసిన కమిషనర్



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కమిషనర్ బాలమాయాదేవి

ఖమ్మంఖానాపురంహవేలిడిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీవెల్ఫేర్ కమిషనర్ బాలమాయాదేవి సోమవారం నగరంలోని పాకబండ బజార్‌లోని రెండు బీసీ బాలికల హాస్టల్స్‌ను తనిఖీలు చేశారు. హాస్టల్‌లోని పరిసరాలను, వంట గది, డైనింగ్ హాల్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు లేవని కమిషనర్‌కు తెలిపారని జిల్లా వెనుకబడిన తరగతులు అభివృద్ధి అధికారి జ్యోతి తెలిపారు. అనంతరం విద్యార్థులతో కమిషనర్ విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు.

రవాణాశాఖలో సమన్వయ లోపం

- మధ్యాహ్నం 1.40తరువాత విధులకు హాజరు
- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనదారుల నిరీక్షణ
- చివరి సమయంలో వాహనాలకు ఆమోద ముద్ర వేసిన ఎంవీఐ



మధ్యాహ్నం 1.30 సమయంలో క్యూలో నిరీక్షిస్తున్న వాహనదారులు

ఖమ్మం సంక్షేమ విభాగం,డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో అధికారుల సమన్వయలోపం కారణంగా వాహనదారులకు నిరీక్షణ తప్పలేదు. సోమవారం కావటంతో జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి ఉదయం 10.30కే నూతన వాహనదారులు, లైసెన్స్ రెన్యూవల్స్, వాహన ఫిట్‌నెస్, ఇతర ధ్రువపత్రాలకు భారీగా వాహనదారులు చేరుకున్నారు. కాగా వాహనాలను తనిఖీలు చేయాల్సిన ఎంవీఐ అధికారులు అందుబాటులో లేకపోవటంతో మధ్యాహ్నం వరకు వాహనదారులకు నిరీక్షణ తప్పలేదు. క్యూలో నిరీక్షించలేక వాహనదారులు గొడవలు పడ్డారు. ఇన్‌చార్ డీటీవోగా ఉన్న వెంకటరమణ, తత్కాలిక ఇన్‌చార్జ్‌గా ఉన్న వరప్రసాద్, ఖమ్మం ఎంవీఐ స్వర్ణలత ఉదయం కార్యాలయంలో హాజరు కాలేదు. ఎంవీఐ స్వర్ణలత మాత్రం కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వెళ్లారని సమాచారం. దీంతో మధ్యాహ్నం 1.40 గంటల వరకు రవాణాశాఖ కార్యాలయంలో ఎంవీఐలు అందుబాటులో లేరు. క్యూలో ఉన్న వాహనదారుల ఒకరితో మరోకరు గొడవలు పడ్డారు. చివరి సమయంలో ఖమ్మం ఎంవీఐ స్వర్ణలత వచ్చి చకాచకా వాహనాల ధృవపత్రాలను మంజూరు చేశారు. ఇదే అదునుగా కొంతమంది దళారులు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు కూడా ధ్రువీకరించుకున్నారని సమాచారం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

అశ్వాపురం డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొండికుంట అలుగువాగు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఓయువకుడు మృతిచెందాడు. సంఘటనకు సంబంధించి సోమవారం అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని ఎటపాక మండలం తునికిచెరువు గ్రామానికి చెందిన ఊకే సంతోష్(20) కొన్నేళ్లుగా మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బంధువుల ఇంట్లో ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి సీతారాంపురంలోని బంధువుల ఇంటికి వెళ్లి బైక్ పై వస్తుండగా మార్గమధ్యంలో అలుగువాగు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని అశ్వాపురం ఎస్‌ఐ తిరుపతిరావు సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించి,బంధువుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీ కొని..

మధిర రూరల్ (ఆంధ్రజ్యోతి): మధిర మండలం క్రిష్టాపురం గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని టిప్పర్ ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి కిషోర్‌రెడ్డి(42) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అయ్యప్పమాల ధరించి శబరిమలై వెళ్లి సోమవారం తెల్లవారుజామునే ఇంటికి వచ్చాడు. సిరిపురం గ్రామంలో ఉన్న తన కుమారుడిని తీసుకొని సాయంత్రం నాలుగుగంటల సమయంలో అత్తగారిల్లు అయిన జమలాపురం గ్రామానికి తీసుకు వెళ్లి అక్కడ దించాడు. ఆతర్వాత స్వగ్రామమైన సిరిపురం గ్రామానికి ద్విచక్రవాహనానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కృష్టాపురం గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిషోర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. టిప్పర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతోనే అక్కడికక్కడే మృతిచెందినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

మణుగూరుటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన కొట్టె పిచ్చమ్మ (70) భద్రాచలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. అశ్వాపురం మండలం మొండికుంట గ్రామానికి చెందిన పిచ్చమ్మ సీపీఎం సినియర్ నాయకురాలు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోస్టు మార్టమ్ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎండీ హాస్పిటల్ రోడ్డులో చోరీ..

ద్విచక్రవాహనంతో పాటు బంగారం, నగదు అపహరణ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): షిర్డీ సాయినాధుని దర్శనం కోసం వెళ్లగా ఆ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ నెల 20న పట్టణంలోని ఎండీ హాస్పిటల్ రోడ్డులో వెలగలేటి కుండరి, సంధ్య దంపతులు ఇంటికి తాళం వేసి షిర్డీ వెళ్లారు. ఈ క్రమంలో తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు బీరువా పగులకొట్టి రూ.40వేల విలువైన బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదుతో పాటు ఆవరణలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

పెనుబల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి సోమవా రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పెనుబల్లిలో జరిగింది. అవివాహితుడైన సంబోజు శివశంకరచారి (35) కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. తల్లి అనారోగ్యంగా ఉండటంతో సోదరుడి వద్ద వేరే గ్రామంలో ఉంటుంది. శివశంకరచారి కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి సోదరుడికి ఫోన్ చేసి తాను చనిపోతానని చెప్పాడని గతంలో కూడా ఇలానే చెప్పడంతో సోదరుడు కూడా పట్టించుకోలేదు. దీంతో సోమవారం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఎస్.వెంకటేష్ సంఘటనాస్థలాన్ని చేరచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం..

- రాష్ట్రంలో బీజేఎంసీ విస్తరణ కోసం కృషి
- జాతీయ చైర్మన్ బిస్వప్రియచౌదరి



మాట్లాడుతున్న బీజేఎంసీ జాతీయ చైర్మన్ బిస్వప్రియచౌదరి

జూలూరుపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని బీజేపీ-బీజేఎంసీ జాతీయ చైర్మన్ బిస్వప్రియచౌదరి తెలిపారు. సోమవారం జూలూరుపాడులోని యల్లంకిగార్డెన్ ఫంక్షన్ హాలులో భారతీయ జనతా మజ్దూర్‌సెల్ (బీజేఎంసీ) ఆధ్వర్యంలో కార్మిక, ప్రజా సమస్యలపై సదస్సును ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో అనేకమంది కార్మికులు రోజువారి జీవనం గడిపేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని తెలిపారు. రాష్ట్రంలో బీజేఎంసీ విస్తరణకై తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సభలో బీజేపీ - బీజేఎంసీ జాతీయ అధ్యక్షుడు అర్నాబ్ చటర్జీ, అఖిల భారత దళిత యాక్షన్‌కమిటీ జాతీయ ఉపాధ్యక్షులు మహవీర్ కొరివి, బీజేపీ - బీజేఎంసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ప్రశాంత్‌కుమార్, బీజేపీ - బీజేఎంసీ జాతీయ సెక్రటరీ ఎస్. పవర్, తెలంగాణ మహిళ అధ్యక్షురాలు కొడెం సీతాకుమారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్రా నాగమణి, ఉపాధ్యక్షురాలు కొదురుపాక నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ పర్యటన



కొదుమూరు వందనం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ (ఈఎన్‌సీ) అనిల్‌కుమార్ సోమవారం పర్యటించారు. గత ఆగస్టు, సెప్టెంబరులో సంబవించిన వరదల సందర్బంగా జిల్లాకు మంజూరైన పనులు, నిలిచిన పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాయకన్‌గూడెం, పాలేరు రిజర్వాయర్‌తో పాటు పలు పనులను ఆయన పరిశీలించా రు. జరిగిన పనులు ఎలా నిర్వర్తించారనే విషయాన్ని పరి శీలించారు. నిలిచిపోయిన వాటికి నిధులు ఎన్ని అవసరం ఉందనే విషయాలను జిల్లా అధికారులతో సమీక్షించారు. కొదుమూరు, వందనం ఎత్తిపోతల పథకం కూడా వరదల కారణంగా మరమ్మతులకు గురవ్వడంతో వాటిని పరిశీలించారు. ఆయన వెంట సీఈ విద్యాసాగర్, ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, బస్వరాజు తదితరులున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

సత్తుపల్లిరూరల్/భద్రాచలం డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో వైరా మండలం విప్పలమడకకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బూరుగు జయరాజుకు 6నెలల జైలుశిక్షతో పాటు బాధితునికి అసలుకు అదనంగా రూ.9.10లక్షలు చెల్లించాలని సత్తుపల్లి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి వడ్డే లావణ్య సోమవారం తీర్పు చెప్పారు. కల్లూరు మండలం విశ్వనాధపురానికి చెందిన ఫిర్యాది ముదిగొండ్ల రామనరసింహారావు తన కుటుంబ అవసరాల నిమిత్తం 2015లో రూ.8.50లక్షలు అప్పుగా తీసుకొని అదేరోజు ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. అనంతరం బాధితుడు తన బాకీ చెల్లించాలని ఒత్తిడి చేయగా 2016 ఫిబ్రవరి 1న నిందితుడు రూ.9.10లక్షలకు చెక్కు జారీచేశాడు. ఆ చెక్కును బాధితుడు తన బ్యాంక్ ఖాతాలో జమ చేయగా నిందితుని ఖాతాలో సరిపడా నగదు లేనందున చెక్కు బౌన్స్ అయింది. దీంతో బాధితుడు రామనరసింహారావు తన న్యాయవాది పిన్నం జానకి రామారావు ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై విదంగా తీర్పు చెప్పారు.

భద్రాచలం, (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో రామ్‌శెట్టి శ్రీను అనే వ్యక్తికి అరు నెలల జైలు శిక్ష, రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వి.శివనాయక్ సోమవారం తీర్పు వెల్లడించారు. సారపాక గ్రామంకు చెందిన కల్లెం వీరాంజనేయులు వద్ద రామ్‌శెట్టి శ్రీను తన వ్యక్తిగత చెక్కు పెట్టి రూ.5 లక్షలు తీసుకున్నారు. ఆ చెక్కు బ్యాంకులో వేయగా బౌన్సు అయ్యింది. దీంతో వీరాంజనేయులు కోర్టులో కేసు వేయగా కోర్టులో వాదోపవాదాలు అనంతరం శ్రీనుకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 లక్షల నష్టపరిహారం విధించారు. ఫిర్యాదు దారు తరపున న్యాయవాది ముత్యాల కిషోర్ కేసు వాదించారు.

అదుపుతప్పి బ్రిడ్జి గోడను ఢీకొట్టిన కారు



ముదిగొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కారు అదుపుతప్పి బ్రిడ్జి గోడను ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన ముదిగొండ మండలం గోకినపల్లి వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఖమ్మానికి చెందిన ప్రభాకర్ ఖమ్మం నుంచి నేలకొండపల్లి వైపు కారులో వెళ్తుండగా గోకినపల్లి రహదారిలో హైవే వద్ద అదుపుతప్పి బ్రిడ్జి గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రభాకర్‌కు స్వల్పగాయాలు కాగా కారు నుజ్జునుజ్జు అయింది.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తిరుమలాయపాలెం, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చావా శివరామకృష్ణ తెలిపారు. సోమవారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా దూదిమెట్ల వెంకట్ నియమితులైన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం వివిధ వర్గాల అభివృద్ధికి చేపడుతున్న సంక్షేమపథకాలు వివరించి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రావూరి యాకోబరావు, దొడ్డ గురవయ్యజానీ, సలీమ్, నజీర్, రషీద్ పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	24 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	30
బీరకాయ	54
పచ్చిమిర్చి	38
కాకరకాయ	34
బెండకాయ	24
పొట్లకాయ	34
దోసకాయ	38-38
చిక్కుడు	48
నాటుచిక్కుడు	74
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	24
దొండ	58-64
సొరకాయ	28
క్యారెట్	38
క్యాప్సికం	68
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	40-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	185
కొత్తిమీర కట్ట	30

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

మునిసిపాలిటీ ఫిర్యాదులు ఇంటినుంచే

- బల్దియాలో 'బడ్డీ' పేరుతో మొబైల్ యాప్ సేవలు
- పురపాలక, నగరపాలక సంస్థల పేరుతో రూపకల్పన
- 15 అంశాలు పొందుపరిచిన మున్సిపల్‌శాఖ
- గతంలో ఉన్నా.. పట్టించుకోని అధికారులు
- తాజాగా అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీలు





ఖమ్మం,డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రభుత్వం 2018లో మొబైల్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'సిటిజన్ బడ్డి' పేరుతో 15అంశాలతో దీన్ని రూపకల్పన చేశారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉండి, ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే కార్పోరేషన్ సేవలు కళ్లెదుటే కనిపిస్తుంటాయి. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) అధికారులు మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో వారు అందించే సేవలను దీనిలో ఉంచారు. గతంలోనే దీన్ని రూపొందించినప్పటికీ ప్రజలకు పూర్తిగా అవగాహన లేకపోవడం, అవగాహన ఉన్నవారు యాప్‌ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ వాటిని అధికారులు పట్టించుకోకపోవడంతో మరుగున పడిపోయింది. కాగా ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఈ యాప్‌ను తెరపైకి తీసుకొచ్చారు. కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదుల నిమిత్తం వచ్చే వారి సంఖ్య తగ్గించే క్రమంలో భాగంగా ఈ యాప్‌ను ఉపయోగించుకుని సులువుగా ఫిర్యాదులు చేయాలంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. మిగిలిన మునిసిపాలిటీల్లో మాత్రం సంబంధిత యాప్ సేవలను పట్టించుకోని పరిస్థితులు నెలకొన్నాయి.

15అంశాలతో యాప్ రూపకల్పన

మీప్రాంతంలో ఎలాంటి విభాగానికి సంబంధించిన సమస్య అయినా సరే సంబంధిత కార్పోరేషన్‌లో, మున్సిపాలిటీల్లో ఉన్న ఆయా అధికారులు, ప్రజాప్రతినిధులు వారి ఫోన్ నంబర్లను మొబైల్‌యాప్‌లో పొందుపరిచారు. రాష్ట్రంలో 70 మున్సిపాలిటీలు, కార్పోరేషన్లకు సంబంధించిన యాప్‌లను రూపొందించిన అధికారులు సేవల్లో లోపాలను నేరుగా కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా పొందుపర్చారు. 15అంశాలతో యాప్‌కు రూపకల్పన చేసిన అధికారులు అందులో ప్రజాప్రతినిధులు, ఆస్తి పన్ను చెల్లింపులు, ఫిర్యాదులు, పౌర సేవలు, నీటిసరఫరా వాహనం, మీ ప్రాంతఅధికారులు, దరఖాస్తు పత్రాలు, సిబ్బంది జాబితా, ప్రకటనలు, అర్బన్ బైట్స్, ప్రసార వార్తల సేకరణ, సలహాలు, ముఖ్యమైన కాంటాక్ట్‌లు, సంప్రదించండి ఉన్నాయి. ఏయే సర్టిఫికేటుకు ఎంత సమయం పడుతుంది, ఏమేమి ధృవీకరణ పత్రాలు అందించాలి వంటి అంశాలకు సంబంధించిన సమాచారం ఆయా యాప్‌ల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచారు.

మీ ప్రాంత అధికారులు ఫిర్యాదులు

మీ డివిజన్, స్ట్రీట్ అంశం, సర్వీసులను పొందరుపర్చారు. డివిజన్/స్ట్రీట్ అంశంపై క్లిక్ చేస్తే మీ ప్రాంతంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నంబర్లను అందుబాటులో ఉంచారు. వారిలో దోమలు, డ్రైనేజీ, డస్ట్‌బిన్ ఎవరెవరు ఎయే పనులు చేస్తారో వివరించారు. వారితోపాటుగా డీఈ, ఏఈ, టీపీవో, నంబర్లు వారి పేర్లు అందుబాటులో ఉంచారు. యాప్‌లోనే ఇంటి దగ్గరనుంచే ఫిర్యాదులు చేయొచ్చు. ఒకవేళ ఫిర్యాదుకు స్పందన రాని పక్షంలో సంబంధిత సెక్షన్‌లోని అధికారులు, వారి ఫోన్ నంబర్లను సిబ్బంది జాబితాలో పొందుపరిచారు. వాటి ద్వారా నేరుగా అధికారులకు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించే అవకాశం ఉంది.

పరిష్కరిస్తే పదింతల మేలు..

యాప్‌ద్వారా అన్నీ రకాల సేవలు అందిస్తున్నప్పటికీ కార్పోరేషన్, మునిసిపల్ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు మాత్రం తమ సమస్యలను యాప్‌ద్వారా ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నారు. గతంలో యాప్‌ను రూపొందించిన సమయంలో యాప్ ద్వారా పెద్ద ఎత్తున ప్రజలు సమస్యలను ఫిర్యాదు చేసినప్పటికీ వాటిని పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ ఉన్నతాధికారులనుంచి సంబంధిత ఫిర్యాదుపై కిందిస్థాయి సిబ్బందికి సమస్య వెళ్లినప్పటికీ వారు నామమాత్రంగా సమస్యపై స్పందించి దానిని పరిష్కరించకుండానే ఫిర్యాదును క్లోజ్ చేసేవారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాదు ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో కనీసం దీని గురించి పట్టించుకునే నాధుడే లేడన్న వాదన లేకపోలేదు. కాగా ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించగలిగితే ప్రజలకు పదింతలు మేలుచేసినవారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

ఖమ్మంటౌన్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రజాపోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని 60డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు చేసి, డివిజన్ల అభివృద్ధి కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో విఫలం కావటం వల్లే గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే పంథాలో పేదలకు ప్రాధాన్యతను ఇవ్వటంలేదని నున్నా విమర్శించారు.ఈ సమావేశంలో సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, జిల్లా కమిటీసభ్యులు ఎంఏ.జబ్బార్,ఎస్. నవీన్‌రెడ్డి, డీ.తిరుపతిరావు, షేక్ మీరాసాహెబ్, పార్టీమండల కార్యదర్శులు భూక్యా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, షేక్ నాగుల్‌మీరా, బత్తిని ఉపేందర్ పాల్గొన్నారు.



సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	బచ్చలమల్లి
సాయిరాం:	విడుదల
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

కేఎంసీ ప్రజావాణి రసాభాస

- మున్నేరు బాధితులతో అధికారుల వాగ్వాదం
- వేతనాల కోసం పార్కు ఉద్యోగుల నిరసన
- ఫిర్యాదులు స్వీకరించిన ఆర్వో శ్రీనివాసరావు
- కార్యాలయంలో ఉండి, హాజరు కాని పలు విభాగాల అధికారులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్వో శ్రీనివాసరావు

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం రసాభాసగా సాగింది. మున్నేరు వరద బాధితులు తమకు పరిహారం అందలేదని పెద్ద ఎత్తున ప్రజావాణికి వచ్చారు. వారికి సరైన సమాధానం ఇవ్వాల్సిన అధికారులు.. బాధితులతోనే వాగ్వాదానికి దిగారు. తొలిజాబితాలో పేరు ఉందని, నేటివరకు పరిహారం అందలేదని చంటి పిల్లల్ని ఎత్తుకొని కొంతమంది తల్లులు వచ్చి అధికారులను ప్రాధేయపడ్డారు. పదుల సంఖ్యలో బాధితులు ప్రజావాణికి తమ ఆధార్ నెంబరు, బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్లు తీసుకొని వచ్చి పరిహారం అందలేదని వాపోయారు. అక్రమ కట్టడాలను తొలగించాలని, తాగునీటి సమస్యలు పరిష్కారం చేయాలని, ఇందిరమ్మ సర్వేలో తమ కుటుంబ సభ్యుల పేర్లు రాలేదని ప్రజావాణిలో ఫిర్యాదులు అందాయి. పార్కు ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని టీయూసీఐ జిల్లా కార్యదర్శి జీ.రామయ్య ఆధ్వర్యంలో కేఎంసీ ఎదుట నిరసన చేపట్టారు. కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ హాజరు కాకపోవటంతో రెవెన్యూ అధికారి జీ.శ్రీనివాసరావు ఫిర్యాదులు స్వీకరించారు. కాగా పలు విభాగాల అధికారులు కేఎంసీ కార్యాలయంలో ఉండి కూడా ప్రజావాణికి హాజరు కాకపోవటంతో కిందిస్థాయిలోని ఉద్యోగులు ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్లు పి.శ్రీజ,పి.శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారు ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, డీఆర్వో ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఫిర్యాదుల్లో కొన్ని..

- కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన బి.రవి గ్రామపరిధిలోని సర్వే నెంబర్ 77లో ఎకరం 20 గుంటల వ్యవసాయ భూమి తన తల్లి పేరు మీద ఉందని, ఆ భూమిపై తాను ఆధారపడి జీవిస్తున్నామని, 10 సంవత్సరాల క్రితం ఎన్టీపీసీ స్వాధీనం చేసుకుని జీవనోపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు ఎటువంటి ఉద్యోగం ఇప్పించలేదని, నాకు ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నాడు.
- రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామానికి చెందిన శిల్ప ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేశానని, గ్రామంలో జరిగే సర్వేలో పేరు రాలేదని, ఆన్లైన్లో పేరు వచ్చేలా చూడాలని కోరింది.
- సింగరేణి మండలం గంగారాం తండ గ్రామానికి చెందిన భూక్యా ఉషారాణి తాను బీఈడీ చదివానని, సదరం సర్టిఫికెట్‌లో వివరాలు తప్పుగా నమోదు అయ్యాయని, వాటిని సరి చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకుంది.
- కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన తుడుం బేబి తాము ఎస్సీ కులానికి చెందిన వారమని, కూలి పని చేస్తూ జీవిస్తున్నామని, ప్రభుత్వం తరఫున భూమి సహాయం చేయగలరని వేడుకుంది.

29న సుదీర్ఘ భజన భక్తి గీతాల కార్యక్రమం

ఖమ్మంసాంస్కృతికం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో 12గంటల సుదీర్ఘ భజన భక్తిగీతాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గాయకుడు నాగసాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు లైవ్‌ఆర్కెస్ట్రాతో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తెలుగుబుక్‌ఆఫ్‌రికార్డ్స్, జీనియస్ బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లలో నమోదు కోసం ఈ కార్యక్రమాన్ని జరుపబోతున్నట్లు పేర్కొన్నారు.

3న తీర్థాల ఆలయంలో వేలంపాట

ఖమ్మంరూరల్ డిసెంబరు23(ఆంధ్రజ్యోతి):మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వర ఆలయంలో నిర్వహించనున్న జాతర పూజా సామగ్రి విక్రయించుకునేందుకు జనవరి 3న ఆలయ ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓశేషయ్య సోమవారం ఓప్రకటనలో తెలిపారు. కొబ్బరి కాయలు, పూజాసామగ్రి, లడ్డూప్రసాదం, పులిహోర, మరమరాలు విక్రయించుకునేందుకు, కొబ్బరి చిప్పలు పొగుచేసుకునేందుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు వివరించారు.

న్యాయాధికారి పరిచయ కార్యక్రమం

ఖమ్మంలీగల్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): సోమవారం బార్‌అసోసియేషన్ హాల్లో ప్రత్యేక సంచార కోర్టు న్యాయాధికారి బి.నాగలక్ష్మి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం దివంగత కామ్రేడ్ చల్లా శంకర్ సీనియర్ న్యాయవాది గుర్తుగా రాసిన గరీబోళ్ల లీడర్ చల్లా శంకర్ అను పుస్తకమును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు డి.రాంప్రసాద్, కల్పన, కె.వి.చంద్రశేఖర్, బి.రజని, ఆర్.శాంతిలత, వి.మాధవి, ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి సీహెచ్.వెంకట్, బార్ కార్యవర్గం సీనియర్, జూనియర్ పాల్గొన్నారు.

ఘనంగా అనఘాష్టమి



ఖమ్మంసాంస్కృతికం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): మార్గశిర అనఘాష్టమి సందర్భంగా సోమవారం ఖమ్మంబస్‌డిపోరోడ్‌లో గల సీతా రామచంద్ర స్వామి కళ్యాణ మండపంలో అనాఘష్టమి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు గురువందనం, గురుపాదుకాపూజ, పాదుకలకు పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, నీరాజనమంత్రపుష్ప పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

తిరుమలాయపాలెం డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా లండన్‌లో ఉంటున్న తన స్నేహితుడు జాన్‌కోప్ అందించిన దుస్తులను సోమవారం మండలంలోని ఎదుల్లచెరువు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు కమతం రాము పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కమతం రాము దుస్తులు అందించడాన్ని హెచ్‌ఎం రవి అభినందించారు. వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

సెల్‌ఫోన్ అందజేత

ఖమ్మంక్రైం,డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): ఆటోలో మర్చిపోయిన సెల్‌ఫోన్‌ను ప్రయాణికురాలుకు ఆటోడ్రైవర్ అందజేశరు. వైఎస్ఆర్ నగర్ ఆటోఅడ్డాలోని పాషాఅనే డ్రైవర్ ఆటోలో ఓప్రయాణికురాలు సోమవారం ఖమ్మం వచ్చారు. ఆటోలో ఫోన్ మర్చిపోయి వెళ్లడంతో గుర్తించిన ఆటోడ్రైవర్ పాషా ఈ విషయాన్ని ట్రాఫిక్ ఎస్ఐ సాగర్‌కి తెలిపారు. ఎస్ఐ ఆమె వివరాలు తీలుసుకొని సెల్‌ఫోన్ అందజేశారు.

సైన్స్‌పోటీల్లో న్యూవిజన్‌కు ప్రథమ స్థానం

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): గురుదక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ మైఖేల్ తెలిపారు. న్యూవిజన్ ఒలంపియాడ్ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఏజ్వల్, యండి అయాన్ ప్రథమ స్థానం పొంది రెండు ల్యాప్‌టాప్‌లు పొందారని తెలిపారు. వీరిని విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్ జికె ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్ అభినందించారు.



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం


ప్లాస్టిక్ బ్యాగ్ అమ్మకాల దుకాణానికి జరిమానా

ఖమ్మంసంక్షేమ విభాగం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):ప్లాస్టిక్‌క్యారీ బ్యాగులు అమ్ముతున్న దుకాణయజమానికి రూ.10వేల జరిమానా విధించారు. ఖమ్మం నగరంలోని 39వ డివిజన్ శివాలయం వీధిలోని కంచర్ల కిషోర్ దుకాణంలో కేఎంసీ పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య సోమవారం తనిఖీలు చేశారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు,గ్లాసులను స్వాధీనం చేసుకొని, జరిమానా విధించారు.

నోటు పుస్తకాల పంపిణీ

ఖమ్మంరూరల్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్దారుపల్లి ప్రాథమిక ఉన్నతపాఠశాల విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు మల్లిడి రమేష్ సహకారంతో సోమవారం నోటు పుస్తకాలు పంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సిద్దినేని కోటయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శాంతి, వినోదా, పార్వతి, శ్రీదేవి, వనజ, నీలు, రవికిషోర్, వెంకన్న, సోమయ్య, సీపీఎం నాయకులు వేగినాటి బుచ్చిరామయ్య, మత్రివాసు, సన్మతిరావు, మడిపల్లి వెంకన్న, రంజాన్‌పాషా, జక్కంపూడి కృష్ణ, మల్లెబోయిన రాజశేఖర్, యం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీజీవో ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో జిల్లాఅడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థల)పి.శ్రీజ, జిల్లాఅడిషనల్ రెవెన్యూ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి క్రిస్మస్ కేక్ కట్ చేసి సంబరాలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్‌ఏఓ అరుణ, డీఆర్డీవో సన్యాసయ్య డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, ల్యాండ్ సర్వేఏడీ శ్రీనివాసరావు, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం బాధ్యులు కొణిదేన శ్రీనివాసరావు, గుంటపల్లి శ్రీనివాసరావు, జైపాల్, తాళ్లూరు శ్రీకాంత్, కోణార్ ఆయుష్ ప్రకాష్ వెంకన్న ఎర్ర రమేష్ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం ప్రజలకు సౌకర్యంగా ఉండాలి

మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభా దృష్టిలో పెట్టుకొని రహదారుల నిర్మాణం జరపాలని, పార్కులను అభివృద్ధి చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ సూచించారు. సోమవారం గాంధీచౌక్‌లోని మూడు బొమ్మల సెంటర్‌లో మేయర్ పర్యటించారు. స్థానికంగా ఉన్న నీటి ట్యాంకుపై పలు పార్టీల నాయకులు ఫిర్యాదులు చేయటంతో ప్రజల కోరిక మేరకు నీటి ట్యాపులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం 31వ డివిజన్‌లోని పార్కులను తనిఖీ చేశారు. పార్కు ప్రహరీ ఎత్తు పెంచాలని, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కార్యచరణ చేయాలని ఈఈ కృష్ణలాల్, డీఈ మాధవిని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు.



డీఈకి సూచనలు ఇస్తున్న మేయర్

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

కామేపల్లి,డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పొన్నెకల్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. తేమ శాతం 17 కంటే ఎక్కుగా లేకుండా ధాన్యం తరలించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవి, ఆర్ఐ సక్రు, ఏఈఓ ఉష రైతులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 13 రోజులకు చేరుకుంది. సోమవారం ఎస్ఎస్ఏ ఉద్యోగులు కలెక్టరేట్ గేటు ఎదుట బతుకమ్మ ఆట ఆడి నిరసన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించేందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉద్యోగులను చర్చలకు పిలవాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌పాషా కోరారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్ పేస్కేల్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ నిర్మల, విజయలక్ష్మీ పాల్గొన్నారు.



కలెక్టరేట్ గేట్ ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



వికలాంగులకు ఆర్థిక భరోసా కల్పించాలని వినతి

కారేపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వికలాంగులకు అధికారులు ఆర్థిక భరోసా కల్పించాలని, వారికి పరికరాలు చార్జింగ్ సైకిళ్లు మంజూరుచేయలని అదనపు కలెక్టర్ శ్రీజను కోరారు. మండల పీఎస్ఆర్ యూత్ మండల కమిటీ అధ్యక్షుడు జర్పల ధోని ఆధ్వర్యంలో పలువురు వికలాంగులు ఖమ్మం తరలివెళ్లారు. డీఆర్డీవో సన్యాసయ్య, ఐసీడీఎస్ పీడీ రాంగోపాల్‌రెడ్డిని కూడ కలసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి భూపతిరాజు, గొల్ల మంజులా, రమేష్, అంజమ్మ, బత్తుల సౌందర్య, లావుడియా సురేష్, గుగులోత్ సర్వన్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో సీపీఐ శతవసంతాల ఉత్సవాలు

వైరా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 26న జరిగే సీపీఐ శతవసంతాల ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆపార్టీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్ర బాబు పిలుపునిచ్చారు. సోమవారం వైరాలోని రజబ్‌అలీ భవన్‌లో షేక్.షరీఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26న ఖమ్మంలో రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గారపాటి అశోక్, కొండా రామకృష్ణ, కొండా, జీవీఆర్, బండారుపల్లి ముత్తయ్య పాల్గొన్నారు.

ట్యాక్సీ డ్రైవర్, ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక

పెనుబల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండల ట్యాక్సీ, డ్రైవర్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని సీఐటీయూ జిల్లా నాయకుడు గాయం తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా రామాల నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా అన్నపురెడ్డి రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

- కల్లూరులో తగ్గుతున్న రహదారి విస్తీర్ణం
- ప్రమాదాలకు నిలయంగా మారే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు..
- శాఖల మధ్య సమన్వయ లోపం?



కల్లూరులో ఆర్అండ్‌బీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

కల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కల్లూరు పట్టణంలో హైవే రహదారిపై ఇరువైపుల ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమణలకు గురికావటమే కాకుండ యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. స్థానికంగా మెయిన్‌సెంటర్‌లో పలువురు యాజమానులు తమ భవనాలకు ఎదురుగా గల ఆర్అండ్‌బీ స్థలాలను ఆక్రమించుకొని అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్న ఆర్అండ్‌బీ, పంచాయతీ, పోలీసు శాఖల అధికారుల తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ హైవే రహదారిపై నిత్యం పలు రాష్ట్రాలకు చెందిన వాహనాలు తిరుగుతు నిత్యం రద్దీగా ఉంటుంది. మరో వైపున జన సంచారం కూడ అదే స్థాయిలో ఉంది. ఇరువైపుల 110 అడుగుల దూరంలో రహదారి విస్తరించి ఉంది. ఇరువైపున గల యాజమానులు తమ ఇష్టారాజ్యంగా ఆర్అండ్‌బీ స్థలాలను తమ పరిధిలో ఉన్నంత వరకు ఆక్రమించటమే కాకుండ తమ వ్యాపార లావాదేవిలకు అవసరమైన విధంగా రేకుల షెడ్లు నిర్మించటం, గృహాలకు సంబంధించి మెట్లు నిర్మిస్తున్నారు. తమ సొంత వాహనాలను పార్కింగ్ చేసుకునేలా ఆర్అండ్‌బీ స్థలాల్లో కాంక్రీటు వేసి ప్లాట్ ఫాంలు కూడ నిర్మించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధింత అధికారులు తమకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కల్లూరు హైవే రహదారికి ఇరువైపుల సుమారు 4 కిమి దూరంలో ఆర్అండ్‌బీ స్థలాలను ఆక్రమణలకు గురిఅవుతున్నా ఎవరు పట్టించుకోక పోవటం తో ఈ రహదారి విస్తీర్ణం తగ్గి ప్రమాదాలు నిలయంగా మారే అవకాశం ఉంది. మరో వైపున స్థానిక మెయిన్ సెంటర్‌లో హైవే రహదారిపై ఇరువైపుల తమ భవనాల మందు గల ఆర్అండ్‌బీ స్థలాలను కూడా యజమానులు చిరువ్యాపారులకు నెలవారి అద్దెలకు ఇస్తూ ఆదాయం పొందుతున్నారు. ఈ పరిస్థితులో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ రద్దీ కూడ ఎక్కువగా ఉంది. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో పేదల కల సాకారం

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ » వైరాలో మోడల్ హౌస్‌కు శంకుస్థాపన



ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

వైరా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో పేదల చిరకాల స్వప్నమైన ఇందిరమ్మ ఇళ్లు నెరవేరబోతుందని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం వైరాలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలు ఇళ్లు లేక అనేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. రాష్ట్రం కేసీఆర్ పాలన నుంచి విముక్తి పొంది ఇందిరమ్మరాజ్యం ఏర్పాటు అయిందన్నారు. మోడల్ హౌస్‌ను చూసి ప్రతి ఒక్క నిరుపేద కుటుంబం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయానికి అనుగుణంగా ఇంటినిర్మాణం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, నాయకులు దొడ్డా పుల్లయ్య, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, చప్పిడి వెంకటేశ్వరరావు, ధార్న రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కారేపల్లి నాయకులు

కారేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో అవసరమైన గ్రామాల్లో తక్షణమే సీసీ రోడ్ల ఏర్పాటకు అవసరమైన నిధులు మంజూరు చేసిన వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను సోమవారం కాంగ్రెస్ మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి మండల పరిధిలోని 41 పంచాయతీలలో అవసరమైన గ్రామలకు సీసీ రోడ్లు మంజూరుచేయడం పట్ల ఎమ్మెల్యేను కలిశారు. తిరుపతిరావు వెంట తోగరశ్రీను, అడెర్ల రామారావు, అజ్మీరహేమ్లా నాయక్, అజ్మీర సురేష్ పాల్గొన్నారు.

వైరాలో కళాక్షేత్రం మంజూరు చేయాలి

వైరా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతున్న నియోజకవర్గ, మునిసిపాలిటీ కేంద్రమైన వైరాలో కళాక్షేత్రం మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు కళాకారుల సమాఖ్య నేతలు వినతిపత్రం సమర్పించారు. వైరా కళాకారులకు ప్రసిద్ధిగాంచిందని, గతంలో రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహించిన సందర్భాలున్నాయని, స్వాతంత్రోద్యమాల్లో సైతం ఎందరో వైరా కళాకారులు తమ కళారూపాలతో పోరాట స్ఫూర్తిని రగిలించారని పేర్కొన్నారు. వైరాలో కళావేదిక లేకపోవడం వల్ల కళాకారులు నిరుత్సాహానికి గురవుతున్నారని, కళాకారులను ప్రోత్సహించే విధంగా కళావేదికకు అవసరమైన స్థలం, భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, స్థానిక కళాకారులు డి.కుటుంబరావు, చల్లా కృష్ణారావు, సీహెచ్.వెంకటేశ్వరరావు, షేక్.పాషా, పూర్ణకంటి రామారావు, పి.గోపాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త దారా గాంధీ కన్నుమూత



కల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత దారా గాంధీ (80) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. వ్యాపార రంగంలో మంచి గుర్తింపు పొందారు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయన దుర్గాప్రసాద్ ఆర్య వైశ్య వైశ్య ప్రముఖులు చారుగుండ్ల అచ్యుత సీతారామారావు, పసుమర్తి రాంబాబు, దోసపాటి భాస్కరరావు తదితరులు గాంధీ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గాంధీ భార్య భారతి, కుమారులు దారా రమేష్‌గుప్తా, దారా రంగా, శ్రీనులను పరామర్శించి వారికి సానుభూతి సంతాపం తెలిపారు.

గోమాతకు అంతిమ సంస్కారాలు..



ఆవుదూడను ఊరేగింపుగా తీసుకెళ్తున్న స్థానికులు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గోమాతకు స్థానికులు అంతిమ సంస్కారం నిర్వహించారు. సోమవారం సత్తుపల్లి పాత సెంటర్‌లో ప్రమాదవశాత్తూ లారీ ఢీకొనడంతో ఆవు దూడ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. యజమాని మోరంపూడి సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఆ దృశ్యాన్ని చూసి తల్లడిపోతుంటే గమనించిన స్థానికులు గోమాతకు సంప్రదాయ బద్ధంగా పసుపుకుంకుమ జల్లి నూతనవస్త్రాలు కప్పి వేద మంత్రోచ్చరణలతో అంతిమ యాత్ర నిర్వహించారు. వేశ్యకాంతల చెరువు వద్ద సత్తుపల్లి మునిసిపాలిటీ సహకారంతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

నిరుపేద మహిళలకు చీరల పంపిణీ

కల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని సంజీవయ్య కాలనీలో క్రిస్మస్ వేడుకను పురస్కరించుకొని సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. దాతలు పాపబత్తిని నగేష్, ఉబ్బన దేవదాసు, తదితరుల సహకారంతో రూ.50 వేల విలువగల చీరలను మహిళలకు వితరణ చేశారు. దయానంద్ ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, బాగం ప్రభాకరచౌదరి, ఏనుగు సత్యంబాబు, తక్కెళ్లపాటి ప్రసాద్, భుక్యా శివ కుమార్‌నాయక్, ఆళ్ల నరిసింహారావు, దామాల రాజు, దాతలు నగేష్, ప్రభాకర్. వాడపల్లి రమేష్, ఉబ్బన కాంతరావు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులకు దుస్తులు

మధిరటౌన్ (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ లోని పారిశుధ్య కార్మికులకు పసురా గ్రూప్ వారు వితరణ చేసిన దుస్తులను మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత సోమవారం మునిసిపల్ కార్యాలయంలో అందజేశారు. ఆమె మాట్లాడుతు ప్రతి సంవత్సరం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పసురా గ్రూప్ వారు మునిసిపల్ కార్మికులకు ఉచితంగా దుస్తులు అందచేయడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సంపత్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, మొండితోక జయాకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

తల్లాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రీస్తూ సంఘం చర్చిలో సోమవారం సరికొండ వీరంరాజు జ్ఞాపకార్థం నిరుపేదలకు మనుమడు లోకేష్‌రాజు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఇస్రాయేల్, సందర్శకులు పాల్గొన్నారు.

జేవీఆర్ కళాశాలలో వినియోగదారుల దినోత్సవం

సత్తుపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు సోమవారం స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ఘనంగా నిర్వహించారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించామని, నైతికంగా సమాజానికి ఉపయోగపడే విధంగా వ్యవహరించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి తెలిపారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, మోసపూరిత కార్యకలాపాలపై జాగ్రత్తలు, తీసుకోవాల్సిన అవసరాలను వివరించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగ అధిపతి డాక్టర్ ఓ.చెన్నారావు, అధ్యాపకులు డాక్టర్ టీ.కృష్ణారావు, ఎస్‌కే.చాంద్ పాషా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డులో అడ్వైజరీ కమిటీలను నియమించాలి

పెనుబల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్ బోర్డులో అడ్వైజరీ కమిటీలను నియమించాలని భవన నిర్మాణ రంగ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ రంగ అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వెల్ఫేర్‌బోర్డు నష్టపరిహారాలను రెట్టింపు చేయాలని, ప్రమాద బీమాకు సంబంధించి రూ.ఆరు నుంచి రూ.పదిలక్షలకు పెంచాలని, సాధారణ మరణానికి ఇచ్చే రూ.లక్షకు రూ.రెండులక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు చలమాల విఠల్‌రావు, నాయకులు బొంతు మాధవరావు, ఎం.బుడ్డయ్య, సుధాకర్, చందు, చీపు వెంకటేశ్వరరావు, గుడిమెట్ల బాబు, తడికమళ్ల చిరంజీవి పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీకి కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి



నివాళులర్పిస్తున్న దయానంద్

సత్తుపల్లి/మధిరటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు 20వ వర్ధంతిని సోమవారం సత్తుపల్లిలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ స్థానిక మునిసిపల్ ఆఫీస్ ఎదుట ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మధిరటౌన్(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని, పీవీ నరసింహారావు వర్ధంతిని సోమవారం మధిర లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు దుంపా వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, మాధురి మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు: బీఆర్ఎస్



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న లింగాల, కొండబాల

బోనకల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పథంలో ఉన్న రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలకులు అధోగతి పాలు చేశారని సీడ్స్, జడ్పీ మాజీ చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో గత బీఆర్ఎస్ హయంలో ఏర్పాటు చేసిన తెలంగాణా తల్లి విగ్రహానికి సోమవారం వారు పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ మార్పు తీసుకు రావడమంటే విగ్రహాలను మార్చడం కాదన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి చూపించాలని సవాల్ విసిరారు. అక్రమ కేసులు, పేదల ఇళ్ల కూల్చివేతల మినహా రాష్ట్రంలో కొత్తగా ఏం పనులు చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బందం శ్రీనివాసరావు, బాణోతు కొండ, మోదుగుల నాగేశ్వరరావు, కాకాని శ్రీనివాసరావు, పారా ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని, రెమ్యూనరేషన్ చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. నవంబరు 6వ తేదీ నుంచి ప్రారంభమై ఆన్‌లైన్‌లో సర్వేను సబ్మిట్ చేసేవరకు ఉపాధ్యాయులు పాల్గొన్నారని, ఈ క్రమంలో ప్రభుత్వ సెలవులు 5రోజులు కూడా కోల్పోయామని, సకాలంలో స్పందించాలని కోరారు. కార్యక్రమంలో కే.వెంకటేశ్వరరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఏసు చూపిన మార్గంలో పయనించాలి

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- పలు మండలాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు



కొణిజర్లలో సెమీ క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు/కొణిజర్ల/వైరా/ బోనకల్/కల్లూరు/పెనుబల్లి/ మధిరటౌన్/ మధిర రూరల్/ఎర్రుపాలెం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు సూచించిన సన్మార్గంలో ప్రయాణించాలని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం స్థానిక రైతువేదికలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నికులాల, మతాలను గౌరవిస్తుదన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో రమేష్, సొసైటీ అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, మండల నాయకులు ప్రభావతిరెడ్డి, భూక్యా లాలునాయక్, లచ్చిరంనాయక్, వీరునాయక్, మాలోతు నరసింహారావు, పోతుల సైదులు, పూసంసుధీర్, నల్లమల శివకుమార్, నిమ్మల నాగేశ్వరరావు, గిద్దగిరి సత్యనారాయణ, చింతనబోయిన సీతారాములు, పంతగాని నరేష్, రోహిత్‌సాయి, పాస్టర్లు అద్బుతకుమార్, ప్రాన్సిస్, జాస్పాట్, ఫిట్టర్ తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల (ఆంధ్రజ్యోతి): కొణిజర్లలో సోమవారం నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొని క్రైస్తవసోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. దుస్తులను పంపిణి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, సొసైటీ వైస్ చైర్మన్ నెల్లూరు రమేష్ పాల్గొన్నారు.

వైరా (ఆంధ్రజ్యోతి): వైరాలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కామిశెట్టి కల్యాణమండపంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, పాస్టర్ యోహాన్ పాల్గొన్నారు.

బోనకల్(ఆంధ్రజ్యోతి): బోనకల్ దివ్యదయాళ్ వృద్ధాశ్రమంలో సోమవారం తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంపీడీవో రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య సెమి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్, ఆశ్రమ నిర్వాహకులు ఇస్రాయిల్, కాంగ్రెస్ యువనేత బీపీ నాయక్ పాల్గొన్నారు.

కల్లూరు (ఆంధ్రజ్యోతి) కల్లూరు పట్టణంలో పలు విద్యా సంస్థల్లో సోమవారం ముందస్తుగా సెమీక్రిస్మస్ వేడుకల సంబరాలను జరుపుకున్నారు. ప్రతిభ విద్యా సంస్థల డైరెక్టర్ లక్కినేని ప్రసాద్ కరస్పాండెంట్ లక్కినేని రఘు, అధ్యాపబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుబల్లి (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుణోదయ స్కూల్‌లో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు పి.శంకర్, వి.శ్రీను, ప్రిన్సిపాల్ పీవీ.ప్రసాద్ పాల్గొన్నారు.

మధిరటౌన్ (ఆంధ్రజ్యోతి): సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం మధదిర లోని రెడ్డి గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, తహసీల్దార్ రాంబాబు, ఎంపీ డీవో వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ విద్యాలత, కమిషనర్ సంపత్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు పాల్గొన్నారు.

మధిర రూరల్(ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో సెమీ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం డి.శ్యామల, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడులో సెంట్ ఆన్స్ బాలికల పాఠశాలలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చిపాదర్ కొప్పుల శౌరి, ఎస్ఐ వి.వెంకటేష్, కరస్పాండెంట్ సిస్టర్ కుమారి, సిస్టర్ జీజి, సిస్టర్ లావణ్య,ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ముదిగొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో ఆశాలత ఆదేశించారు. సోమవారం ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం, కమలాపురం గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీవో వాల్మీకి కిషోర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ముదిగొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు బాణాపురం, మేడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు బండి నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో బాణాపురం పాఠశాలకు చెందిన శ్రీహర్షిత, వెన్నెల, రేవతిలు అత్యుత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకాగా మేడేపల్లికి పాశాలలకు చెందిన యు వర్షిణి పుట్‌బాల్ రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఘనంగా గణిత దినోత్సవం

తల్లాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలభారతి విద్యాలయంలో సోమవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. భారత గణిత మేధావి శ్రీనివాసా రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత చిహ్నాలు, 1729ఆకృతిలో విద్యార్థులు కూర్చోని ప్రదర్శించారు.కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ రామారావు పాల్గొన్నారు.

17 ఎల్ పంట కాలువ డిజైన్ మార్చాలి

ఏన్కూరు, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): సీతారామ 17 ఎల్ పంట కాలవ డిజైన్ మార్చి నాచారం గ్రామంపైనుంచి చేపట్టడం వల్ల ఉపయోగపడుతుందని గ్రామసభలో గ్రామస్థులు ఆందోళన చేశారు. సోమవారం నాచారం, గంగుల నాచారం, భద్రతండా, ఇమాంనగర్ గ్రామాల్లో భూసేకరణ గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా ప్రస్తుత డిజైన్ మార్చి నాచారం గ్రామంపై నుంచి రాళ్లవాగు ప్రాజెక్టు నింపడం వల్ల ఎంతో ఉపయోగమని గిరిజన రైతులు అధికారులకు తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ వంశీ, తహసీల్దార్ శేషగిరి రావు, ఎంపీడీవో రమేష్, స్పెషల్ ఆఫీసర్ అనూష, ఎంపీవో జీవీఎస్ నారాయణ, ఆర్ఐ నవీన్ పాల్గొన్నారు.

మునిసిపాలిటీల్లో మొబైల్ యాప్ సేవలు

- 15 అంశాలు పొందుపరిచిన శాఖ
- ఖమ్మంలో అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీలు

ఖమ్మం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) అధికారులు మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో వారు అందించే సేవలను వాటి వివరాలను ప్రజలకు చేరువ చేసేందుకు కొత్తగా మొబైల్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఇది 2018 సమయంలోనే రూపొందిం చినప్పటికీ దానిపై ప్రజలకు పూర్తిగా అవగా హన లేకపోవడం, అవగాహన ఉన్నవారు యాప్‌ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ వాటిని అధికారులు పట్టించుకోకపోవడంతో మరుగున పడిపోయింది. కాగా ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఈ యాప్‌ను తెర పైకి తీసుకొచ్చారు. కమిషనర్ కార్యాలయా నికి ఫిర్యాదుల నిమిత్తం వచ్చే వారి సంఖ్య తగ్గించే క్రమంలో భాగంగా ఈ యాప్‌ను ఉపయోగించుకుని సులువుగా ఫిర్యాదులు చేయాలంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు.

15 అంశాలతో యాప్‌కు రూపకల్పన చేసిన అధికారులు అందులో ప్రజాప్రతినిధులు, ఆస్తి పన్ను చెల్లింపులు, ఫిర్యాదులు, పౌరసేవలు, నీటి సరఫరా వాహనం, మీ ప్రాంత అధికారులు, దరఖాస్తు పత్రాలు, సిబ్బంది జాబితా, ప్రకటనలు, అర్బన్ బైట్స్, ప్రసార వార్తల సేకరణ, సలహాలు/ సూచనలు, ముఖ్యమైన కాంటాక్ట్‌లు, సంప్రదించండి ఉన్నాయి. ఈ యాప్ ద్వారా ఇంటి సంఖ్య ద్వారా ఆస్తిపన్ను తెలుసుకుని చెల్లింపులు జరపొచ్చు. ఆస్తిపన్ను చెల్లింపు జరపాలంటే యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న అనంతరం ఆస్తిపన్ను మీద క్లిక్ చేస్తే నేరుగా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణకు లింక్ చేయబడి ఉంటుంది. అది ఓపెన్ చేసిన తర్వాత పీటీఐ నంబరు లేదా అసెస్మెంట్ నంబరు ఎంటర్ చేసి చెల్లింపులు జరపొచ్చు. అంతేకాదు పౌరసేవలకు సంబంధించిన అంశాలను సైతం యాప్‌లో పొందరుపర్చారు డివిజన్/స్ట్రీట్ అంశంపై క్లిక్ చేస్తే మీ ప్రాంతంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నంబర్లను అందుబాటులో ఉంచారు. వారిలో ఎవరెవరు ఏయే పనులు చేస్తారో వివరించారు. వారితోపాటుగా డీఈ, ఏఈ, టీపీవో, నంబర్లు వారి పేర్లు అందుబాటులో ఉంచారు.